క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

యాచారం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యాచారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 12 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గురుకులాల్లో ప్రవేశం పొంది బదిలీ కోసం ప్రయత్నం చేసే విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మైసమ్మ తల్లికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

యాచారం: సాగర్ రోడ్డుపై తక్కళ్లపల్లి తండా వద్ద ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మొదటిరోజు ఆలయ నిర్మాణ దాత, పర్వతారోహకుడు అంగోత్ తుకారాం, మానస దంపతులు పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రం నుంచి ప్రధాన పూజారులు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం శ్రీ హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ హాజరుకానున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు సహకరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంల పరిధిలోని ఎల్మినేడులో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో గురువారం నోట్‌బుక్స్‌ను ఆయన అందజేశారు. అవకాశాలను అందిపుచ్చుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్, కరుణాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, స్వామి, జంగయ్య, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ అందజేస్తున్న జెడ్పీటీసీ నిత్యారెడ్డి

మంచాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మండలంలోని బండలేమూర్‌కి జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రొసీడింగ్‌ను గురువారం స్థానిక నాయకులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన మంచాల మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన తండాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయండి: ఎస్ఎఫ్ఐ

అబ్దుల్లాపూర్‌మెట్: ఎలాంటి అనుమతులు లేకుండా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాములలో కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఎంఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శివకుమార్ మాట్లాడుతూ.. సదరు పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోగా, నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం

- వన, అటవీ శాఖ నర్సరీల్లో మొక్కల పెంపకం
- మండలంలో 2.54లక్షలకు పైగా నాటేందుకు సమాయత్తం
- ప్రభుత్వ ఆదేశాలే తరువాయి



ఎల్మినేడు ఫారెస్టు నర్సరీలో పెంచిన మొక్కలు

ఇబ్రహీంపట్నం: వర్షాలు సంవృద్ధిగా పడగానే వన మహోత్సవంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేశారు. దీనికనుగుణంగా అటవీ, ఉపాధిహామీ శాఖల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలను పెంచారు. మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల నర్సరీల్లో.. ఒక్కో నర్సరీకి 11వేల చొప్పున మొత్తం 1.54 లక్షల మొక్కలను, అటవీశాఖకు చెందిన రెండు నర్సరీల్లో సుమారు లక్ష మొక్కలను పెంచుతున్నారు. జూలై మొదటి, రెండు వారాల్లో ప్రతి యేడు హరితహారం పథకం కింద మొక్కలను నాటుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఈ పథకాన్ని ప్రారంభిస్తుందో ఇంకా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. దీనికి తోడు వర్షాలు కూడా అంతంతమాత్రమే ఉన్న నేపథ్యంలో కూడా వనమహోత్సవం ఆలస్యం అయ్యింది. రానున్న వారం పదిరోజుల్లో వానలు సంవృద్ధిగా కురిస్తే త్వరలోనే ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులంటున్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో..

అటవీశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎల్మినేడు, దండుమైలారం నర్సరీల్లో.. కానుగ, శివచిత్త, చిత్త, మొదుగా, చింత, తాని, వేప, ఉసిరి, సీతాఫల్, తదితర లక్ష మొక్కలు ఫారెస్టు ప్రాంతాల్లో నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీ నర్సరీల్లో గృహావసరాల నిమిత్తం పెరట్లో, ఇంటి ముందు నాటేందుకు జామ, దానిమ్మ, చామంతి, గన్నేరు, గులాబీ, కరివేపాకు, మునగ, నిమ్మ, పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఫారెస్టు ఏరియాలో వెలుగ చెట్లు, పత్రి, అల్లనేరడు, బిల్వపత్రం, నీడ నిచ్చేందుకు కానుగ, వేప, గుల్మొహర్, పెల్టోఫాం, శిశు, శిశల్ పినియా, రైతులు తోటల్లో పెంచుకునేందుకు మామిడి, జామ, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, పొలాల గట్లుపై పెట్టుకునేందుకు యూకలిప్టస్, మల్బర్, వేప, చెరువు గట్లపై పెంచేందుకు ఈత, ఖర్జూరా మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో ఆరువేల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి



వనమహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. 14 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో 1.54 లక్షల మొక్కలు పెంచుతున్నాం. ప్రతి ఇంటికి, రైతులకు, రోడ్ల కిరువైపులా, పొలాల గట్లపై మొక్కలను నాటుతాం. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలి.

– తిరుపతిచారి, ఏపీఎం, ఇబ్రహీంపట్నం

లక్ష మొక్కలు నాటుతాం



ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఎల్మినేడు, దండుమైలారం అటవీశాఖ నర్సరీల్లో దాదాపు లక్ష మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వనమహోత్సవ ఆదేశాలు రాగానే ఫారెస్టు ఏరియాల్లో వీటిని నాటుతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, అటవీశాఖ సాంకేతిక సహాయకుడు, ఇబ్రహీంపట్నం

అండర్‌పాస్ వద్దు.. ఫ్లైఓవర్ ముద్దు

పనామా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



పనామా చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణానికి బదులుగా ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని బీజేపీ హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పలువురు నాయకులు పేర్కొన్నారు. అండర్‌పాస్ వద్దని, ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని రెండు రోజుల క్రితం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అండర్‌పాస్ నిర్మాణం పనులు జరుగుతుండటంతో గురువారం వారు పనామా వద్ద మళ్లీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అండర్‌పాస్‌ల వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉండే షాపుల వారి వ్యాపారం దెబ్బతిని వారి జీవనోపాధి పోతుందని, యూటర్న్ సమస్యలు వస్తాయని వారు అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అండర్ పాస్ నిర్మాణాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారి భాస్కర్, కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తడకమళ్ల విజయ్‌కుమార్, నూతి శ్రీనివాస్, పారంద మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఎస్ఐగా శ్రీనివాసులు



ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్ఐగా పి.శ్రీనివాసులు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా ఇదివరకు పనిచేసిన కేతావత్ బల్‌రాం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీసు స్టేషన్‌కు బదిలీ కాగా అదే స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఆమనగల్లుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు.. సీఐ ప్రమోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పీఎస్ సిబ్బంది ఎస్ఐ శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు.

రైతు రుణమాఫీ హర్షణీయం

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ.ఖలీల్ అన్నారు. రైతులకు మాట ఇచ్చిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ అమలు చేస్తున్నారని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు.

'గెస్ట్ ఫ్యాకల్టీ'కి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియమాకం కోసం అర్హతగల అభ్యర్థులు జూలై 1వ తేదీ లోపు కళాశాల కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ప్రభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్, ఫిజిక్స్, క్రాఫ్ ప్రొడక్షన్, డెయిరీ సైన్స్ సబ్జెక్ట్ పోస్టులు ఒక్కొక్కటి ఉన్నట్లు తెలిపారు. సంబంధిత పీజీలో అభ్యర్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ,ఎస్టీలు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన మేయర్ దుర్గ, నాయకులు

మీర్‌పేట: పేదింటి ఆడబిడ్డల వివాహాల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకంతో ఎన్నో కుటుంబాలకు లబ్ధి చేకూరిందని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్ లాల్ చౌహాన్ అన్నారు. గురువారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 24 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ బి.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి,కార్పొరేటర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వెంకటేశ్

యాచారం: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సంఖ్యపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు శాఖాల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందుకొని నాలుగు నెలలు గడుస్తున్నా అర్హులైన వారికి పోస్టింగ్ ఉత్తర్వులు లేవని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులపై సర్వే చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు చందునాయక్, వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నాగారంలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మహేశ్వరం: మండలంలోని నాగారం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శైలజ పర్యటించారు. ఈ సందర్భంగా నాగారం గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీ కమ్యూనిటీ ప్లాంటేషన్, నాగిరెడ్డిపల్లిలోని నర్సరీ, కంపోస్ట్ యార్డ్, స్మశాన వాటికలను పరిశీలించారు. అలాగే, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించండి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు కావొస్తున్నా నూతన భవనంలో పాఠశాల తరగతులు ప్రారంభించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతేడాది పాఠశాల తరగతులు కొనసాగిన అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ ఏడాది కూడా అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తే ఎలా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి వెంటనే పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలని కోరారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజిత్, రమేష్, అఖిల్, గణేశ్, రామ్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి–మాల్ రూట్లో బస్సులు నడపాలి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు సోషల్ వర్కర్ రవీందర్‌గుప్తా వినతి

యాచారం: కల్వకుర్తి డిపో నుంచి మాల్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ పి.రవీందర్‌గుప్త గురువారం ఫోనులో విజ్ఞప్తి చేశారు. కోవిడ్‌కు ముందు కల్వకుర్తి డిపోకు చెందిన బస్సులను.. కల్వకుర్తి నుంచి ఆమనగల్ వయా.. సరికొండ, నక్కర్తమేడిపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ వరకు, అలాగే కల్వకుర్తి నుంచి వయా.. సరికొండ, నక్కర్తమేడిపల్లి, మాల్ వరకు నడిపేవారని తెలిరు. కోవిడ్ అనంతరం ఆయా సర్వీసులను నిలిపివేశారని ఈ విషయమై కల్వకుర్తి డిపో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా బస్సులు నడపటం లేదని సజ్జనార్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం డిపో నుంచి గ్రామీణ ప్రాంతాలకు కోవిడ్ అనంతరం బస్సు సర్వీసులను చాలావరకు బంద్ చేశారని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. రవీందర్ ఫిర్యాదులను నమోదు చేసుకున్న సజ్జనార్.. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి బస్సులు నడిచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త బస్సులను కొనుగోలు చేస్తుందని అనంతరం అన్ని గ్రామాలకు బస్సులు నడిచేలా చూస్తామని సజ్జనార్ హామీ ఇచ్చారని రవీందర్ గుప్తా తెలిపారు.

రహదారి మరమ్మతులు చేపడతాం



కుంగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో బావర్చీ హోటల్ ఎదురుగా జాతీయ రహదారి కుంగిపోయింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అక్కడికి చేరుకుని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. రోడ్డు కింది డ్రైనేజీ ట్రంక్ లైన్ ఉన్నందున రోడ్డు కృంగిపోయి ఉంటుందని ఆయన అన్నారు.

అక్రమ షెడ్డు కూల్చివేత



షెడ్డును కూల్చివేస్తున్న సిబ్బంది

మీర్‌పేట: అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మహేష్ ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య మీర్‌పేట నందిహిల్స్‌లోని పందెం కోడి మీట్‌ను కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోండి

హస్తినాపురం: రానున్న బోనాల పండుగను కాలనీల్లోని ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ నిధులు మంజూరు చేస్తుందని, ఈ నిధుల కోసం హస్తినాపురం డివిజన్‌లోని ఆలయాల పాలక మండలి దరఖాస్తు చేసుకోవాలని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి తెలిపారు. గురువారం హస్తినాపురంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఆలయాల కమిటీ సభ్యులు కమిటీ లెటర్ ప్యాడ్‌పై బోనాల అభివృద్ధి నిధుల కోసం అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్ రంగారెడ్డి జిల్లా అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతేడాది వచ్చిన నిధులు ఎన్ని, ఈ సంవత్సరం ఎన్ని నిధులు కావాలనేది అందులో పేర్కొనాలని అన్నారు. ఆలయం, అమ్మవారి ఫొటోలతో పాటు కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల ఆధార్ కార్డులను జత చేసి ఈ నెల 30 లోపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సత్యంచారి అన్నారు.

అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని ఆర్మీ ఫిజి క ల్ అకాడమీలో అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ నందునాయక్ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని, ఆర్మీ, ఎస్ఎస్‌సీజీడీ, ఆర్పీఎఫ్, ఢిల్లీ పోలీస్, ఎస్ఐ, పీసీలుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. అగ్నివీర్ అభ్యర్థులకు 1600 పరుగు కోసం ప్రత్యేకంగా శిక్షణ, ప్రాక్టీస్ ఇక్విప్‌మెంట్స్, పుల్ అప్‌బార్ ఏర్పాటు చేశామని, పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు తమ ఫలితాల షీట్ తీసుకుని చేరవచ్చని తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భాస్కర్
- తలకొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పుస్తకాల బహూకరణ



పుస్తకాలతో భాస్కర్, నాయకులు, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: పుస్తక పఠనంతో స్వీయ విశ్లేషణ సామర్థ్యం పెరగుతుందని ఎస్సీ రిజర్వేన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జినుకుంట్ల భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పుస్తక బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జినుకుంట్ల భాస్కర్ తన సొంత ఖర్చులతో దేశ నాయకుల చరిత్రకు సంబంధించి వివిధ రకాల పుస్తకాలను తలకొండపల్లి ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి (లైబ్రరీ) బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుస్తక పఠనంతో సామాజిక సమస్యలపై అవగాహన, సామాజిక స్పృహ ఏర్పడుతుందని.. అలాగే భాషపై పట్టు పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ కోశాధికారి బలరాం, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, జిల్లా సలహాదారులు రమేష్, రాజు, మల్లేశ్, శివ, శ్రీకాంత్, దేవేందర్, మనోహర్, శ్రీను, భరత్, రామకృష్ణ, శ్రీశైలం, రామలింగం పాల్గొన్నారు.